క్లుప్తంగా

నేడు మంత్రి జోగి రమేష్ రాక

కృత్తివెన్ను: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సోమవారం చెరుకుమిల్లి గ్రామంలో పర్యటిస్తారని మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. గ్రామంలో అన్నపూర్ణాదేవి ఓంకారేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నేడు పెడన కౌన్సిల్ సమావేశం

పెడన: పెడన కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో జరిగే సమావేశానికి సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అగ్ని బాధితుడికి సాయం

కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ రంగారావు నివాసగృహం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. వాసవీ కపుల్స్ క్లబ్, కొడాలి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విశ్వంశెట్టి మొగలేశ్వరగుప్తా బాధితుడి కుటుంబానికి రూ.5 వేల విలువ చేసే గృహోపకరణలు, బియ్యం, నిత్యావసర సరుకులు రూ.2 వేల నగదును అందించారు. అవనిగడ్డకు చెందిన భీంజి అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోలాబత్తిన గోపాలం బాధితుడి కుటుంబానికి రూ.5 వేల నగదును అందించారు.

నేడు రీ సర్వే ప్రారంభం

పెడన: పట్టణంలో వైఎస్సార్ భూ హక్కు, భూ రక్ష శాశ్వత హక్కు పత్రం పథకానికి సంబంధించి డ్రోన్ కెమెరాతో నిర్వహించనున్న రీ సర్వే ప్రక్రియను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం ఉదయం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు మార్కెట్‌యార్డులో జరిగే కార్యక్రమానికి మంత్రి హాజరవుతారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

క్రికెట్ కిట్టు అందజేత

పెదప్రోలు(మోపిదేవి): క్రీడాకారులకు అవనిగడ్డ శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు ఆదివారం క్రికెట్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో హరి, ధార్మిక సేవకులు రేమాల శ్రీనివాసరావు, అడపా రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

తుంగపల్లెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రవచనాల నడుమ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో జరిపారు. అవనిగడ్డ, కోడూరు, వి.కొత్తపాలెం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి, ఆలయం వద్దే సహపంక్తి భోజనాలు నిర్వహించారు. తలపై గండుదీపాలతో మొక్కులు సమర్పించారు. అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది.

విజేతలకు బహుమతుల ప్రదానం



గూడూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి ఆదివారం బహుమతులను అందజేశారు. గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజులుగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

మృతుని కుటుంబానికి సాయం



కోనేరుసెంటర్: కానూరు పీఏసీఎస్ సభ్యుడు జొన్నల వీరరాఘవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సొసైటీ తరఫున మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 10 వేలను సొసైటీ అధ్యక్షుడు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు ఆదివారం మృతుని భార్య లలితాంబకు అందజేశారు. కానూరు ఉప సర్పంచ్ గోపు మురళి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపాబత్తుల చూడామణిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



వృద్ధుడు చినకోటయ్యతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు



కరగ్రహారంలో గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

- పేర్ని కిట్టు
- తుమ్మలపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం తుమ్మలపాలెంలో నిర్వహించారు. పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. తుమ్మలపాలెంకు చెందిన యశోధ మాట్లాడుతూ మాకు నలుగురు ఆడపిల్లలు అని, నలుగురు ఉన్నత చదువులు చదువుకుంటున్నారని, ఒక పాప బీటెక్ చేసింది, మరో పాప బీఫార్మసీ చేసింది, మూడో పాప ఇంటర్ చదువుతోంది, నాలుగో పాప పదో తరగతి చదువుతోంది. మాది చాలా పేద కుటుంబం, అయినా సరే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా మా బిడ్డలను చదివిస్తున్నారని ఆనందం వ్యక్తంచేసింది. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల చదువుల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి అన్ని వసతులు కల్పిస్తున్నారని వివరించారు. అదే గ్రామానికి చెందిన వృద్ధుడు చినకోటయ్య మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే పింఛన్ ఇచ్చి మాకు పెద్ద కొడుకులా ఉన్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యాన్ని ఇస్తున్నాడని, అంతటి గొప్ప ముఖ్యమంత్రి ఉండటం మాలాంటోళ్ల అదృష్టమని చెప్పారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ అన్నివర్గాల వారికి మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ బండి దేవానందం, తుమ్మల చెరువు ఇన్‌చార్జి లక్ష్మణ్, తుమ్మల చెరువు వైఎస్సార్ సీపీ నాయకుడు తలారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి..

కోనేరుసెంటర్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులను మరింత చైతన్య పరచాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆదివారం ఆయన పెదకరగ్రహారం, చినకరగ్రహారం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో ఎన్ని గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి.. ఎన్ని శ్లాబు దశలో ఉన్నాయి.. ఎన్ని గృహాలు ప్రారంభ దశలో ఉన్నాయి తదితర వివరాలను వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. కిట్టు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతిల్లు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని చెప్పారు. గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునన్నారు. సమస్యలను ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మంగినపూడిలో జరుగుతున్న బందరు పోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకారాదు

డిప్యూటీ మేయర్ కవిత



విద్యార్థినికి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కవిత

మచిలీపట్నంటౌన్: విద్యార్థుల ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని, వారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్ అన్నారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా సన్ స్టార్ స్కూల్ ఆవరణలో ఆదివారం సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 140 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. అందువల్లే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు వారిని చదివిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డీవైఈఓ యూవీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నగదు బహుమతులు అందజేస్తోందని చెప్పారు.

మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఇంటర్మీడియట్ బోర్డు మాజీ ఒకేషనల్ అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్, స్టార్ కళాశాల డైరెక్టర్ పేర్నేటి శ్రీరాం, న్యాయవాది బాలాజీ, ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, స్టార్ కళాశాల డైరెక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ లైన్ నిర్మాణ పనులు

మంత్రి జోగి రమేష్ చొరవతో నిధుల మంజూరు



పైడమ్మ కాలనీలో జరుగుతున్న విద్యుత్ లైన్ నిర్మాణ పనులు

పెడన: పట్టణంలోని పాత పైడమ్మ కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విద్యుత్ సౌకర్యం కల్పించాలని కొన్నేళ్లుగా కాలనీ వాసులు విన్నవిస్తున్నారు. ఇటీవల కాలనీ వాసులు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌ను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించుకోవడంతో మంత్రి స్పందించారు. మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో పాటు అంచనాలు రూపొందించాలని సూచించారు. తొలుత రూ.8 లక్షలతో అంచనాలు రూపొందించారు. పనుల ప్రారంభంలో జాప్యం జరగడంతో అంచనా రేట్లు అధికమయ్యాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.12 లక్షలు పురపాలక సంఘ నిధులు నుంచి వెచ్చించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యుత్ శాఖాధికారులు మచిలీపట్నం డీఈ ఎం. భాస్కరరావు, ఏడీఈ సీహెచ్ మాణిక్యాలరావు ఆదేశాలతో ఏఈ జయరాం సిబ్బందితో పైడమ్మ పాత కాలనీలో విద్యుత్ లైన్ల పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, తీగలు చేరుకోవడంతో వాటిని నిర్మించే పనులు వేగవంతం చేశారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా నిర్భయానంద స్వామి విగ్రహ ప్రతిష్ఠ

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



నిర్భయానంద విగ్రహానికి పూజలు చేస్తున్న శివస్వామి, విద్యాసాగర్, బంగారుబాబు

పాగోలు(చల్లపల్లి): గ్రామంలోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిరంలో నిర్భయానంద స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మందిర ప్రాంగణంలోని నిర్భయానంద స్వామి అధిష్టానం వద్ద నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శ్రీశైలం మౌనముని ఆశ్రమ పీఠాధిపతి శివస్వామి సమక్షంలో ప్రాతూరి విద్యాసాగర్-శారద, ఆశ్రమ నిర్వాహకులు మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు)-విజయ దంపతులచే వేద పండితులు నిర్భయానంద స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయించారు. ఉదయం స్వామి వారి విగ్రహానికి అధివాస హోమాలు, ప్రతిష్ఠ అనంతరం రత్నన్యాసం, గర్త న్యాసం, ధాతున్యాసం, నవరత్నన్యాసం, బీజ న్యాసం, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, ధేను దర్శనం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో పేద మహిళలకు వస్త్రదానం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆశ్రమంలో 1,008 శివలింగాలను దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. వారికి మేకా బంగారుబాబు నిర్భయానంద పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నిర్భయానంద శిష్యబృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, విద్యుత్ లైన్లు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ఆదివారం మండలంలోని కోకనారాయణపాలెం శివారు అనంతాయిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు. గ్రామంలోని గంగానమ్మ గుడి రోడ్డును రూ. 2 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుగా నిర్మించారు. గుడి ప్రాంతంలో రూ. 2.20 లక్షల వ్యయంతో విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న గంగానమ్మ జాతరలో మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. గంగానమ్మకు పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్ రంగబాబు, మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



గంగానమ్మకు పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్

కార్తికేయుని సన్నిధిలో విజయవాడ సీపీ టీకే రాణా



స్వామివారి సన్నిధిలో విజయవాడ సీపీ టీకే రాణా, ఐజీ సునీల్‌కుమార్ నాయక్

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని విజయవాడ పోలీస్ కమిషనర్ టీకే రాణా, విజయవాడ ఐజీ సునీల్‌కుమార్ నాయక్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు.

ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఆలయ అర్చకులు మూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలు అందజేశారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటెత్తిన భక్త జనం..

మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ సిబ్బంది

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో పాటు వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. వీరంతా సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. యాత్రికులకు సూచనలిస్తూ, సముద్రస్థితిగతుల గురించి వివరించారు. సాగర సంగమం వద్దకు వెళ్లే ఇసుకతిన్నెల రహదారి కోతకు గురికావడంతో పర్యాటకులను అక్కడికి అనుమతించలేదు. సీఐ పవన్‌కిషోర్, ఎస్ఐ జిలానీ పర్యవేక్షణలో గస్తీ నిర్వహించారు.

శ్మశాన ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



శ్మశాన ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు మసీదుల పరిధిలో నూతనంగా కేటాయించిన కబరిస్తాన్ ప్రహరీ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదివారం భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కబరిస్తాన్‌కు రెండు ఎకరాల భూమిని కేటాయించారన్నారు.

ఈ భూమికి ప్రహరీ నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులను మంజూరు చేయించారని చెప్పారు. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా వివిధ మసీదుల ఇమామ్‌లను పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఘనంగా సత్కరించారు. పేర్ని కిట్టును ఇమామ్‌లు సత్కరించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, 7వ డివిజన్ కార్పొరేటర్ పడమట రేవతి, పలు డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీలు షేక్ మొహమ్మద్ సాహెబ్, మొహమ్మద్ రఫీ, రమేష్, అన్వర్ హుస్సేన్, మీర్ నజాఫ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గూడూరు మండలం తరకటూరు నుంచి గూడూరు మీదుగా శారదాయిపేట, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామాల మీదుగా పెడన పార్టీ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ర్యాలీలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. - గూడూరు

జలకాలాటలలో..



రోహిణి కార్తెలో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటలకే ఎండ తీవ్రత అధికమైంది. ఉదయం 10 గంటలకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ, వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం వేళ నాగాయలంకలోని కృష్ణానది శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వద్దకు చిన్నారులు, పెద్దలు చేరారు. చిన్నారులు ఘాట్‌లోకి దిగి ఈత కొడుతూ సందడి చేశారు. సాయంత్రం వేళ కృష్ణాతీరంలో వీచే చల్లని గాలులతో పెద్దలు, యువకులు సేదతీరారు. - నాగాయలంక

సేవలు విస్తృతం

పామర్రు: మానవత సేవాసంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పరుస్తామని మానవత పామర్రు శాఖ కార్యదర్శి ఆరిగెల బాలుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఉచితంగా ఫ్రీజర్ బాక్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. వేసవిలో విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందజేశామన్నారు. ఉపాధ్యక్షులు దాసరి వెంకటరత్నం, పీఎంఎస్ ప్రసాద్, శీతాల ప్రసాద్, సుచిత్ర నాగశ్వేత, వైఎన్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడులు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఆటపాటలతో విజ్ఞాన శిబిరం

మచిలీపట్నంటౌన్: వేసవి సందర్భంగా నగరంలోని పలు గ్రంథాలయాల్లో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. 21 రోజులుగా నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. చిన్నారులు మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, చెస్, లూడో తదితర ఆటలు ఆడటంతో పాటు పాటలకు డ్యాన్స్‌లు చేశారు. ధ్యానం, యోగా చేశారు. ఉపాధ్యాయిని ఎం. విజయ భగవద్గీతలోని 12వ అధ్యాయం 17వ శ్లోకాన్ని నేర్పి తాత్పర్యాన్ని వివరించారు. సరస్వతి ప్రార్థన చేసిన అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చదివించడం, కథలు చెప్పడం వంటివి చేయించారు. ఉపాధ్యాయుడు రాఘవరావు స్పోకెన్ ఇంగ్లిష్ గ్రామర్, జనరల్ నాలెడ్జ్ వివరించారు. సాయంత్రం పరీక్ష నిర్వహించారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పెన్నులు అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో వీటిని నేర్పించారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పెడన: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పెడన భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగింది. 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం 26 సంవత్సరాల తరువాత తిరిగి కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను పంచుకుని ఆనందభరితులయ్యారు. నాటి గురువులు స్టీవెన్‌సన్, నటరాజ్, సుభాషిణి, మణి, కృష్ణకుమారి, సరళాదేవి, విశ్వం, రామకృష్ణ, జయలక్ష్మీ, ఫణిప్రకాష్‌లను సన్మానించి వారి ఆశీస్సులు అందుకున్నారు. పేరం అనురాధ పూర్వ విద్యార్థిని పరుగుల రేసులో జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడంపై గురువులు, సహచర స్నేహితులు అభినందించారు.